క్లుప్తంగా

గణపతి ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దేవన్ రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: వినాయకచవితిని పురస్కరించుకుని పాత గాజువాకలోని లంకా మైదానంలో ఎస్‌వీ ఎంటర్‌టైన్‌మెంట్ యూత్ ఆధ్వర్యంలో వచ్చే నెల 18 నుంచి నిర్వహించనున్న మహాగణపతి ఉత్సవాల బ్రోచర్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. పెదగంట్యాడలోని కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని కమిటీకి సూచించారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ కొసిరెడ్డి గణేష్, రోజారాణి, నిర్మల, పృథ్వీ, మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బీమా నగదు అందజేస్తున్న కార్పొరేటర్ చందు

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డులోని టీవీఎస్ కాలనీకి చెందిన రవి కిరణ్ రాజు కుటుంబానికి ప్రభుత్వం వైఎస్సార్ బీమాను మంజూరు చేసింది. ఇటీవల రవి కిరణ్ రాజు అనారోగ్యంతో మృతి చెందడంతో బీమా క్లెయిమ్ మంజూరు కాగా, తక్షణ సాయం కింద మృతుని కుటుంబానికి రూ.10వేలను కార్పొరేటర్ ఉరుకూటి చందు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరీ శివ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ధర్నా నేడు

గాజువాక: రాష్ట్రంలో పంచాయతీ నిధుల దుర్వినియోగంపై నగరంలో గురువారం ధర్నా నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తెలిపారు. పాతకర్ణవానిపాలెంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్నాకు గాజువాక నుంచి అత్యధికమంది హాజరు కావాలని కోరారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు పుట్టా గంగయ్య, గూటూరు శంకర రావు, శశిధరణ్ పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు ప్రారంభం



క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. స్కూల్ ఎదురుగా గల మైదానంలో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బాలికలకు 7 విభాగాల్లో, బాలురకు 8 విభాగాల్లో ఆటల పోటీలను నిర్వహిస్తామని పీడీ ఇస్మాయిల్ తెలిపారు. హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి.

సింహాచలేశుడికి వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు చక్రవర్తి తదితరులు ఈసేవ నిర్వహించారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- ప్రజల శ్రేయస్సుకోసం ఎన్నో పథకాల అమలు
- పేదల జీవన ప్రమాణం పెంపునకు కృషి
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 86వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: ప్రజా సంక్షేమమే పరమావధిగా ఎన్నో పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పేదల జీవన ప్రమాణాలను పెంచేందుకు అన్నివిధాలా సహకరిస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 86వ వార్డు దువ్వాడ సెక్టార్-2 సచివాలయ పరిధిలో బుధవారం సాయంత్రం ఆయన పర్యటించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, పార్టీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాల ద్వారా వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకిచ్చిన మాట కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, పరిస్థితులు సహకరించకపోయినా సంకల్ప బలంతో సీఎం జగన్ వాటన్నింటినీ అధిగమించి, సుపరిపాలన అందిస్తున్నారన్నారు. అవినీతి, అసమర్థ పాలనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ దశ, దిశ మార్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఆయనకు అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు వార్డులో వెలగని వీధి దీపాల సమస్యతో పాటు కల్వర్టులు, సీసీ రోడ్లు, రేషన్ సరిగ్గా అందకపోవడం వంటి అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు అక్కడికక్కడే తెలియజేసి, సత్వర పరిష్కార దిశగా ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్, శ్రీనివాస్‌పట్నాయక్, మాటూరి శ్రీనివాసరావు, యోహాన్, వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మల, గుండాసు రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో మహిళల కృషి ప్రశంసనీయం

- స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్
- ఘనంగా విప్స్ ఆవిర్భావ వేడుకలు



విప్స్ వేడుకల్లో ప్రసంగిస్తున్న లా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ శ్రీసుధ

ఉక్కునగరం: మహిళలు సమాజంలో అంతర్భాగంగా ఉంటూ దేశ ప్రగతిలో విశేష పాత్ర పోషిస్తున్నారని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ విమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ (విప్స్) 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎల్‌డీసీ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సామాజిక, రాజకీయ, వ్యాపార, వ్యవస్థాపక రంగమైనా, జీవితంలోని ప్రతి రంగంలో మహిళలు తమకంటూ ఒక గుర్తింపును ఏర్పరుచుకోవడం సంతోషకరమన్నారు. భారత ప్రభుత్వం కూడా లింగ సమానత్వం, మహిళా సాధికారతను సృష్టించడంలో సహాయపడే విధానాలను ప్రారంభించి మహిళలను ప్రోత్సహిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లోని మహిళా ఉద్యోగుల సంస్థల ప్రగతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. విశిష్ట అతిథి, దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ పి. శ్రీసుధ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు సాధించిన విజయాలను కొనియాడారు. ప్రభుత్వరంగ విభాగాల్లో ఉన్నత యాజమాన్య పదవుల్లోకి ఎదిగి, మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాతీయ, ప్రాంతీయ స్థాయిల్లో మహిళా ఉద్యోగులు గెలుచుకున్న వివిధ అవార్డుల గురించి తెలియజేశారు. 35 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 19మంది మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా మహిళా ఉద్యోగులకు జేసీఐ, ప్రాజెక్ట్ స్మూత్ వాక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు డి.కె.మొహంతి, ఎ.కె.బాగ్చీ, సురేష్ పాండే, ఉన్నతాధికారులు, విప్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత



సరకులు అందిస్తున్న సూర్యనారాయణ తదితరులు

పెదగంట్యాడ: మృతుడి కుటుంబానికి ఆర్థిక సహకారం అందించి ఆదుకున్నారు రాఘవరెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు. జీవీఎంసీ 75వ వార్డులోని సీతానగరం ఎస్సీ కాలనీకి చెందిన మార్డుపూడి శ్రీను ఆత్మహత్య చేసుకుని మరణించడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న రాఘవరెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ ద్వారపూడి సూర్యనారాయణ బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వారికి నెలకు సరిపడిన నిత్యావసర సరకులు అందజేశారు, కార్యక్రమంలో జాగరపు శ్రీను, వీర రాఘవ రెడ్డి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఆదానీ.. సేవ్ వర్కర్స్

నినదించిన గంగవరం పోర్టు కార్మికులు



మానవహారంగా ఏర్పడిన గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: 'క్విట్ ఆదానీ.. సేవ్ వర్కర్స్', 'క్విట్ మోదీ.. సేవ్ ఇండియా' నినాదాలతో పోర్టు కార్మికులు నినదించారు. అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు బుధవారానికి 37వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో భాగంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పెదగంట్యాడ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. యాజమాన్యం వెంటనే స్పందించి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొవిరి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ, మాద అప్పారావు, సత్యానందం, నొల్లి స్వామి, పేర్ల సూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌బాబు ఫ్యాన్స్ వితరణ



మహిళలకు చీరలు అందజేస్తున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: హీరో మహేష్ బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 69వ వార్డు తుంగ్లాంలో రాయల్ కింగ్ మహేష్ బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్యాన్స్ కొల్లి శ్రీనివాస్ రెడ్డి, గొల్లపూడి సాధు, గిడితూరి అప్పారావు, దొడ్డి శ్రీనివాసరావు, నీలాపు శ్రీనివాస రెడ్డి, గుర్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమానికి కృషి



థింసా కళాకారులతో నృత్యం చేస్తున్న సీఎండీ భట్

ఉక్కునగరం: ఆదివాసీల సంక్షేమం కోసం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కట్టుబడి ఉందని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉక్కునగరం అంబేడ్కర్ కళాక్షేత్రంలో జరిగిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, బిర్సాముండా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ రానున్న మూడు నెలల్లో ప్లాంట్ మంచి లాభాల్లోకి రానుందన్నారు. అన్ని అడ్డంకులను దాటుకుని ముందుకు సాగుతోందన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. తాడన్న, బయ్యే మల్లయ్య మాట్లాడుతూ తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన థింసా, బంజారా, కోయ, ఒరాన్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. జీఎంలు డాక్టర్ ఎం.ఎస్. ప్రసాద్, రవిచంద్రబాబు, వివిధ కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, యు.రామస్వామి, వై.టి.దాస్, అసోసియేషన్ ప్రతినిధులు ఎల్.వి.రమణ, ఎస్.మోహన్‌బాబు, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

మహోద్యమ దిశగా ఉక్కు దీక్షలు



909వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు దీక్ష మహోద్యమం దిశగా మారనుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 909వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడు తూ ఉక్కు ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవరోధాలు సృష్టించినా నిలదొక్కుకుని విజయపరంపరలో కొనసాగుతోందన్నారు. నిర్వాసితులకు, కార్మికులకు అన్యాయం చేస్తూ సంస్థను అమ్మడం దుర్మార్గమని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దళిత కులాల సంక్షేమ సంఘం సభ్యులు

కూర్మన్నపాలెం: ప్రజా గాయకుడు గద్దర్‌కు కూర్మన్నపాలెం దళిత కులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు నివాళులర్పించారు. వుడా ఫేజ్-1 ఫంక్షన్ మాల్ వద్ద నిర్వహించిన గద్దర్ సంతాప సభలో సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు మాట్లాడారు. గద్దర్ పాడిన విప్లవ గీతాలు ప్రజలను ఎంతో చైతన్యపరిచేవన్నారు. బహుజనుల రాజ్యాధికారం కోసం ఎంతో తపన పడిన ఓ దళిత ఉద్యమ నేత ఊపిరి ఆగిపోయిందని, భరతమాత గొప్ప విప్లవ గాయకుడిని కోల్పోయిందని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు అంజలి ఘటించారు. కార్యక్రమంలో గాలి ఆనంద్, బీపే స్వామి, డాక్టర్ జొన్నకూటి విజయ్‌కుమార్, కొల్లి రవికుమార్‌దాస్, ఎస్‌వీ రమణ, బత్తిని సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోలో 27వ రోజుకు కార్మికుల దీక్షలు

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపోలో ఎస్‌ఎంయూ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 27వ రోజుకు చేరుకున్నాయి. డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో జరుగుతున్న దీక్షను సీసీఎస్ సభ్యుడు ఎస్.వి. రమణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన ఓటీ, పే ఎరియర్స్ చెల్లించాలని, గ్యారేజీలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్.వి. లక్ష్మి, వై.ఆర్. ప్రసాద్, ఎన్.పి.రావు, జి.ఎస్. నారాయణ దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో కె.వి.ఆర్.కె.గుప్త, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



స్టీల్ సిటీ డిపో వద్ద దీక్షలో పాల్గొన్న కార్మికులు

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



శిబిరంలో మహిళలకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉక్కునగరం: మహిళలు తమ ఆరోగ్యంపై అశ్రద్ధ వహించకుండా అప్రమత్తంగా ఉండాలని లీ హెల్త్ డొమైన్ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి అన్నారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ సహకారంతో మహిళలకు బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరం ప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు ఇంటి ధ్యాస, విధి నిర్వహణలో ఉండి తమ ఆరోగ్యాన్ని పట్టించుకోని కేసులు అనేకం ఉన్నాయమన్నారు. సకాలంలో వారి అనారోగ్యం గురించి పట్టించుకుంటే వారికి భవిష్యత్తులో ఇబ్బందులు తప్పుతాయన్నారు. శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి తదుపరి చికిత్స గురించి వివరించారు. లీ హెల్త్ డొమైన్ ప్రతినిధులను స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ భాను అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ చాంబర్ ప్రతినిధులు జయలక్ష్మి, లావణ్య, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'యూత్ కాన్‌క్లేవ్ 3.0'



యూత్ కాన్‌క్లేవ్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులతో రెక్టార్ మధుసూదనరావు

అగనంపూడి: భవిష్యత్తులో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, జీవన విధానం, విద్యా వ్యవస్థ ఎలా ఉండనున్నాయో వివరిస్తూ దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన యూత్ కాన్‌క్లేవ్ 3.0 లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో కాన్ఫెడరేషన్ ఇండియా ఇండస్ట్రీ (సీఐఐ) యువ చాప్టర్, మినిస్ట్రీ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ది ఫ్యూచర్ 3.0 యూత్ కాన్‌క్లేవ్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రీన్‌టమ్ సీఈవో తరుణ్, జీటీవై సోలార్ సీఈవో వివేక్ వర్ధన్, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల సీఈవో శ్రీకాంత్ తదితరులు ప్రసంగించారు. భవిష్యత్తులో భారతదేశం ఎలా ఉండబోతుంది, ఆహార ఉత్పత్తుల నుంచి, ఉత్పత్తి రంగం, వ్యవసాయం, విద్య, ఆరోగ్య రంగాలు, జీవన విధానంలో ఎలాంటి మార్పులు రాబోతున్నాయనే అంశాలపై 3వందల మంది విద్యార్థుల ప్రెజెంటేషన్స్ ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, లక్ష్మీ లిడియా, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం



మాట్లాడుతున్న సిటూ ప్రధాన కార్యదర్శి ప్రకాష్

అక్కిరెడ్డిపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై భెల్ ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. సంస్థ ప్రధాన గేటు వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నాశనం అయిపోతున్నాయన్నారు. ఎంతో పోరాడి సాధించుకున్న సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. నెహ్రూ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపిస్తే మోదీ హయాంలో సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్నారని దుయ్యబట్టారు. దీనికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వి.ఆనందరావు, ఎస్.జగన్నాథరావు, సీతంనాయుడు, ఎస్.ఎల్.నర్సింహులు, చిట్టిబాబు, మురళీశ్వరరావు, కె.నారపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ క్రికెట్ జట్టు ఘన విజయం



విజయోత్సాహంలో జీవీఎంసీ క్రికెట్ జట్టు

గాజువాక: జీవీఎంసీ, ఎస్‌ఆర్‌ఐ హాస్పిటల్ జట్ల మధ్య స్థానిక జింక్ మైదానంలో బుధవారం నిర్వహించిన వీడీసీఏ ఇన్‌స్టిట్యూషన్ పూల్ సీ మ్యాచ్‌లో జీవీఎంసీ జట్టు రెండు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్‌ఆర్‌ఐ హాస్పిటల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు నష్టపోయి 143 పరుగులు చేసింది. లక్ష్మీప్రసాద్ 29 పరుగులు, సునీల్ 40 పరుగులు చేశారు. జీవీఎంసీ తరఫున కెప్టెన్ శివ మూడు వికెట్లు, అనిల్ మూడు వికెట్లు, రాజు రెండు వికెట్లు తీసుకున్నారు. బదులుగా జీవీఎంసీ జట్టు ఎనిమిది వికెట్లు నష్టపోయి విజయానికి అవసరమైన పరుగులు చేసింది. నరేష్ కుమార్ 24 పరుగులు, సునంద్ 33 పరుగులు, ప్రకాష్ 28 పరుగులు చేసి జీవీఎంసీ జట్టు విజయంలో కీలకపాత్ర వహించారు. ఎస్‌ఆర్‌ఐ హాస్పిటల్ జట్టు తరఫున జి.పి.నాయుడు మూడు వికెట్లు తీసుకున్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ జట్టును అడిషనల్ కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, టీమ్ మేనేజర్ సన్నీ అభినందించారు.

ఉన్నత ప్రమాణాలతో విద్యనందించడమే లక్ష్యం



ఎంఈవో సాయిశైలజను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించే క్రమంలో పర్యవేక్షణ పెంచేందుకు అదనపు మండల విద్యాశాఖాధికారులను నియమించారని పరవాడ మండల విద్యాశాఖాధికారి గొంతిన సాయి శైలజ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అందిస్తోందని, వాటిని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ దిబ్బపాలెం (దానబోయినపాలెం) పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెను అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎంఈవో-2 వ్యవస్థ ఏర్పాటు అయిందని, దీనివల్ల నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. తద్వారా మరింత నాణ్యత, బాధ్యత పెరుగుతుందన్నారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండల పర్యవేక్షణ ఉన్న అగనంపూడి, ఫార్మాసిటీ కాలనీ పాఠశాలలను విశాఖ జిల్లాలోని గాజువాకలో విలీనం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో కె.అప్పారావు, బి.సత్యనారాయణ, ఎ.ఈశ్వరరావు, ఉపాధ్యాయురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కణితి పీహెచ్‌సీ సిబ్బంది

కూర్మన్నపాలెం: డీ వర్మింగ్ డే సందర్భంగా పాఠశాలల్లో గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నామని కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శివయ్య తెలిపారు. ఈ సందర్భంగా 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం చేతుల మీదుగా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ శివయ్య మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అనంతరం ప్రతీ విద్యార్థి చేత ఆల్బెండజోల్ మాత్రలు నమిలి, మింగించాలని సూచించారు. 10 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలందరికీ మాత్రలు అందించేందుకు ఇప్పటికే అన్ని స్కూల్స్, కాలేజీలకు, ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లకు సరఫరా చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లో దేశభక్తి పెంపొందించేందుకే..



ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్సీ సింహాచలం

గాజువాక: ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా మన నేల- మన దేశం కార్యక్రమం నిర్వహించామని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. గాజువాక జోనల్ అధికారులు, సిబ్బంది బుధవారం పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జోనల్ కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో యూసీడీ విభాగం సహాయ ప్రాజెక్టు అధికారి ఎల్.రాము, వివిధ విభాగాధిపతులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: వెంకటాద్రిపై బుధవారం వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవ మూర్తులను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.